RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 404 | 18 గురువారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# విద్యతోనే జీవితాల్లో మార్పు..

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు: రేవంత్ రెడ్డి



తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు.

రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు.విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు.సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## తెలంగాణలోని హన్మకొండలో పవన్ కల్యాణ్ పర్యటన



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణలోని హన్మకొండలో పర్యటించారు. స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన 15 ఏళ్ల నిరంజన్ అనే బాలుడు తీవ్రమైన నరాల సమస్యతో బాధపడుతున్నాడు. దురదృష్టవశాత్తూ వయసు 15 ఏళ్లయినా ఆ వ్యాధి కారణంగా కేవలం రెండు, మూడేళ్ల పిల్లాడిలాగే కనిపిస్తాడు, పైగా కాళ్లు కూడా పనిచేయవు. జీవితంతో పోరాడుతున్న ఆ చిన్నారికి తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలిసి, ఆయన సినిమా డైలాగ్‌ను ఆయన ముందే చెప్పాలనేది ఒకే ఒక్క చివరి కోరిక. ఈ విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్, నేరుగా ఆ బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. నిరంజన్‌ను ప్రేమగా పలకరించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ భావోద్వేగ భేటీ ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ హన్మకొండలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత స్థానిక రిసార్ట్‌లో జనసేన కార్యకర్తలతో (జనసైనికులతో) ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. అక్కడే లంచ్ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం తిరిగి విజయవాడకు ప్రయాణమవుతారు. మరోవైపు, పవన్ కల్యాణ్ ను చూసేందుకు హన్మకొండలో అభిమానులు పోటెత్తారు.

## విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్




తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి కరువు భత్యాన్ని (డీఏ) 1.62 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,804 మంది ఉద్యోగులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, ఎక్కడా అంతరాయం కలగకుండా నిరంతర సరఫరా కోసం శ్రమిస్తున్న ఉద్యోగుల పనితీరును ప్రభుత్వం గుర్తించిందని భట్టి విక్రమార్క తెలిపారు. టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ వంటి అన్ని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ డీఏ పెంపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు 2035 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్న అంచనాలు నేపథ్యంలో, ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంపొందించడం అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ సంస్థల సిబ్బందికి కాలానుగుణంగా డీఏ సవరించడం సాధారణ ప్రక్రియలో భాగమేనని అధికారులు వెల్లడించారు.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ

### : ట్రంప్ కీలక హామీ



భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు.ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు.ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## పరిస్థితి అనుకూలంగా ఉండకపోవచ్చు...

### వరి సాగు తగ్గించండి: తుమ్మల నాగేశ్వరరావు



ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో వర్షాలు కాస్త తగ్గే సూచనలు ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును కాస్త తగ్గించి, మంచి లాభాలనిచ్చే ఆయిల్‌పామ్ వైపు దృష్టి పెట్టాలని రైతులను ఆయన కోరారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడం ప్రస్తుతానికి మంచి నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇక ఎరువుల కొరత గురించి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90.22 లక్షల బస్తాల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద అత్యధికంగా 59.56 లక్షల బస్తాలు ఉండగా.. రిటైల్ షాపుల్లో 22.67 లక్షలు, సహకార సంఘాల్లో 5.56 లక్షలు, గోడౌన్లలో మరో 3.56 లక్షల బస్తాల స్టాక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.టెక్నాలజీని వాడుకుంటూ రైతులు సులభంగా ఎరువులు పొందేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌కు కూడా మంచి స్పందన వస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు దీని ద్వారా 13.22 లక్షల బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 11.18 లక్షల బస్తాలు ఇప్పటికే రైతులకు చేరిపోయాయని చెప్పారు. రైతుల ఫీడ్‌బ్యాక్ ప్రకారం ఈ యాప్‌లో నిరంతరం మార్పులు చేస్తున్నామని, ఒకవేళ స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఉంటే వారి కోసం ప్రత్యేకంగా టోల్-ఫ్రీ నంబర్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించామని వెల్లడించారు.

## ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై గళమెత్తిన మోదీ



ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. వేలాది మంది భారత నావికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారుఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని స్వాగతిస్తూనే, అక్కడి ఉద్రిక్తతల కారణంగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రపంచ వాణిజ్యం కోసం దేశాలను అనుసంధానించే నావికుల భద్రత మనందరి ఉమ్మడి బాధ్యత. సముద్ర వాణిజ్య మార్గాలు సురక్షితంగా ఉండేలా చూస్తూ, వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలి" అని మోదీ ఉద్ఘాటించారు.హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలోనే కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం నిరంతరాయంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.ఇటీవల ఒమన్ సమీపంలో ఒక వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన సైనిక దాడిలో భారతీయ సిబ్బంది మరణించిన ఘటనపై భారత్ ఇప్పటికే అమెరికాకు దౌత్యపరంగా తన నిరసనను తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భారతీయులు నావికులుగా సేవలందిస్తున్న నేపథ్యంలో, సంఘర్షణ ప్రాంతాల్లో వారి భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## తెలంగాణ విద్యా రంగంలో నూతన అధ్యాయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మంచాల సర్పంచ్ మానస వినయ్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రంగారెడ్డి జిల్లా: మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ప్రారంభించిన సందర్భంగా మంచాల మండల సర్పంచ్ మానస వినయ్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాష్ట్ర విద్యా రంగ అభివృద్ధికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించిన సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలే బలమైన పునాదులు సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ.. మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలే బలమైన పునాదులు అంటూ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది..అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ హాజరై విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసి,అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి అక్షరాభ్యాస చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ..బాల్యంలోనే విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సర్పంచ్ లక్ష్మమ్మ తెలిపారు.పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య,ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడి టీచర్ సంతోష, ఉపాధ్యాయులు పుష్పరాగం, కవిత గ్రామపంచాయతీ కార్యదర్శి వేణు, వార్డు సభ్యులు రాధా, మంగ, బక్కని రవి, తదితరులు పాల్గొనడం జరిగింది

## నేడు విద్యుత్ అంతరాయం వినియోగదారులు సహకరించాలి మహేశ్వరం ఏఈ చక్రపాణి




( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం ఏ చక్రపాణి మాట్లాడుతూ... గురువారం విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1వరకు సర్దార్ నగర్,తుక్కుగూడ పట్టణం లోని లక్ష్మి నగర్, జేకే సూపర్ మార్కెట్ ఏరియా, డీసీపీ ఆఫీస్ ఏరియా,గీతిక విల్లాస్, స్పీడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విల్లాస్ అలాగే మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 6వరకు సూర్యగిరి ఎల్లమ్మ టెంపుల్ ఏరియా,ఆరంజి విల్లాస్, వెంకటేశ్వరా విల్లాస్ ల లో విద్యుత్ అంతరాయం ఉంటుంది.కావున వినియోగదారులు సహకరించగలరు.మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి తెలియజేశారు

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి డిఎంహెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్




హైదరాబాద్,జూన్ 17: ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంబర్ పేట క్లస్టర్ పరిధిలోని బాగ్ అంబర్ పేట, ముషీరాబాద్, బోలక్ పూర్, అంధ్రమహిళ సభ, హరాజ్ పెంట, తిలక్ నగర్ యుపిహెచ్ సీ లకు చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యాక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్దిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ ఆశ్రిత రెడ్డి, డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ వంశిప్రియా, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల పబ్లిక్ స్కూల్ అభివృద్ధి పేరుతో ప్రచార ఆర్భాటమా..? బీఆర్ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్ ప్రశ్న



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పలు సందేహాలు వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం భారీ ప్రచారం చేస్తోందని, అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. పాఠశాల ఆధునీకరణ కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధులతో పాటు ప్రభుత్వ నిధులు కూడా వినియోగించినప్పటికీ, ప్రధానంగా భవనాల బాహ్య భాగాల సుందరీకరణకే పరిమితమయ్యాయని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ప్రహరీ గోడ, డ్రైనేజీ వ్యవస్థ, చిన్నారులకు ఆటవస్తువులు, ఫర్నీచర్, క్రీడా సదుపాయాల ఏర్పాట్లు జరిగినప్పటికీ, పాత భవనాల నిర్మాణాత్మక అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని అన్నారు.
ముఖ్యంగా కొన్ని భవనాలకు బయట భాగంలో మాత్రమే రంగులు వేయగా, వెనుక భాగాలు అలాగే ఉన్నాయని, పాఠశాలలోని మరుగుదొడ్ల పరిస్థితిలోనూ పెద్దగా మార్పు లేదని ఆయన ఆరోపించారు. కొత్త భవనాల నిర్మాణం జరగకుండానే పాఠశాలను పూర్తిగా కొత్త రూపంలో తీర్చిదిద్దినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.
విద్యా రంగంలో నిజమైన మార్పులు తీసుకురావాలంటే మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి సూచించారు. పాఠశాలలో చేపట్టిన పనులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థుల ఆహార పథకంలో స్థానిక కార్మికులకే ప్రాధాన్యం ఇవ్వాలి: ఆరుట్లలో ఆందోళన పాఠశాల భోజన నిర్వహణలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల గళం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం: మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన ప్రభుత్వ విద్యాసంస్థ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహార పథకాల నిర్వహణ అంశం చర్చనీయాంశంగా మారింది. పాఠశాలల్లో అమలవుతున్న ఆహార పంపిణీ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించకుండా, ప్రస్తుతం సేవలందిస్తున్న కార్మికులకే కొనసాగించే అవకాశం కల్పించాలని కోరుతూ కార్మిక సంఘాల ప్రతినిధులు తమ డిమాండ్లను వినిపించారు.
ఈ సందర్భంగా పలువురు కార్మికులు సంఘ నాయకత్వంలో కార్యక్రమ ప్రాంగణానికి చేరుకుని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. విద్యార్థులకు ఆహారం తయారీ, పంపిణీ కార్యక్రమాల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుల ఉపాధి భద్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కొత్త విధానాల పేరుతో బాహ్య సంస్థలకు బాధ్యతలు అప్పగిస్తే వేలాది మంది కార్మిక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.
ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలవుతున్న ఆహార పథకాల విజయానికి స్థానికంగా పనిచేస్తున్న కార్మికుల కృషి ఎంతో ఉందని, వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు సూచించారు. కార్మికుల హక్కులు, ఉపాధి పరిరక్షణకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని, తమ అభ్యర్థనలను ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.
కార్యక్రమం సందర్భంగా తమ సమస్యలపై స్పందించాలని కోరుతూ కార్మికులు శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆధునిక విద్యకు ఆరుట్ల నాంది.. విద్యార్థుల సర్వతోముఖ వికాసమే లక్ష్యం

### ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి.. తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రాష్ట్రంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఆరుట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో కలిసి భోజనశాలను సందర్శించి వారికి అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నగర స్థాయి విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించే వాతావరణం పాఠశాలల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ద్వారానే ఉన్నత ఫలితాలు సాధించాయని ఆయన గుర్తు చేశారు. అదే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతోందన్నారు. నాణ్యమైన తరగతి గదులు, సాంకేతిక వనరులు, క్రీడా మౌలిక వసతులు, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. విద్యార్థులు పాఠ్యాంశాల్లో మాత్రమే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రతిభా రంగాల్లోనూ తమ సామర్థ్యాన్ని చాటుకోవాలని ఆకునూరి మురళి సూచించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలంటే విద్యతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం, సామాజిక విలువలు కూడా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కొత్త పాఠశాల ద్వారా ప్రాంతంలోని విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదల సొంతింటి కల సాకారం..

### కర్ణంగూడలో ఆనందోత్సాహాల మధ్య కొత్త గృహానికి శ్రీకారం ఇందిరమ్మ ఇంటిని శుభారంభం చేసిన సర్పంచ్ ఒంగేటి తిరుమల్ రెడ్డి, ఉప సర్పంచ్ యంపల్ల రవీందర్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం: మండలం ఇబ్రహీంపట్నం కర్ణంగూడలో గ్రామంలో నూతన గృహానికి శుభారంభం ప్రభుత్వ గృహ నిర్మాణ పథక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులు పండాల రమణమ్మ, సత్తయ్య కుటుంబ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఒంగేటి తిరుమల్ రెడ్డి, ఉప సర్పంచ్ యంపల్ల రవీందర్ రెడ్డి కలిసి ఇంటి ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ ఒంగేటి తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సురక్షితమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకం ఎంతో మందికి ఆశాకిరణంగా నిలుస్తోందన్నారు. సొంత ఇంటి కల నెరవేరిన ఈ సందర్భం లబ్ధిదారుల కుటుంబానికి చిరస్మరణీయమైన రోజుగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఉప సర్పంచ్ యంపల్ల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇలాంటి పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. కొత్త ఇంటిలోకి అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వార్డు సభ్యుడు పండాల దేవేందర్ గౌడ్, గ్రామస్థులు పాల్గొని లబ్ధిదారుల కుటుంబానికి అభినందనలు తెలిపారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 గురువారం జూన్ 2026

## సీఎం సభలో న్యాయం కోసం కుటుంబం గళం.. ప్లకార్డులతో దృష్టి ఆకర్షించిన బాధితులు

### ఆరుట్ల వేదికగా బాధిత కుటుంబ ఆవేదన.. ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:+
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ కార్యక్రమం సందర్భంగా ఒక కుటుంబం తమ సమస్యను ప్రజల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. కార్యక్రమ స్థలానికి చేరుకున్న బాధిత కుటుంబ సభ్యులు తమ బంధువు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ న్యాయపరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కొంతకాలం క్రితం విషాదకర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగి మరణానికి సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఎదురైన ఒత్తిళ్లు, వేధింపులే ఆ ఘటనకు ప్రధాన కారణమని వారు ఆరోపించారు. ఈ వ్యవహారంలో నిజానిజాలను వెలికితీసి బాధ్యులపై



చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సభ ప్రాంగణంలో తమ వినతిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన కుటుంబ సభ్యులు, తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం గుర్తించి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన తర్వాత ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బాధితుడి భార్య మాట్లాడుతూ, ఘటన వెనుక ఉన్న అన్ని అంశాలను నిష్పక్షపాతంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే తమ కుటుంబానికి న్యాయం జరిగినట్టవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తమ గోడును ఆలకించాలని ఆమె కోరారు.

కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రజలు కూడా బాధిత కుటుంబ సభ్యుల ఆవేదనను గమనించగా, సంబంధిత అధికారులు వారి వినతిపత్రాలను స్వీకరించినట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు మరోసారి విజ్ఞప్తి చేశారు.

## గుమ్మడవల్లి గ్రామంలో అక్షరాభ్యాస కార్యక్రమం చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ





హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17


రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం, గుమ్మడవల్లి:
గుమ్మడవల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్-1 మరియు అంగన్వాడి సెంటర్-2లలో మూడు నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పల్సా మహేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్సా శ్రీనివాస్ గౌడ్, ఎంపీయుపిఎస్ గుమ్మడవల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ధర్మనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, "నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు. చిన్నారులు సమాజానికి పునాది లాంటి వారు. కాబట్టి వారికి చిన్న వయస్సులోనే మంచి అక్షరాలు, మంచి విద్యా బీజం వేయడం అత్యంత అవసరం" అని పేర్కొన్నారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జహంగీర్ బీ, శ్రీకాంత, ఎంపీయుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయ బృందం సభ్యులు శ్రీకాంత్, విజయదుర్గ, రాధిక, భరత్ కుమార్, అహ్మద్ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యా ప్రాముఖ్యతను చాటి చెప్పడంతో పాటు చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

## హజరత్ సయ్యదిన హైదర్ అలీషా ఖాదిరి రహమతుల్లా అలై దర్గల ఉర్స్ ఇషరీఫ్ గ్రంధోత్సవం ఉత్సవాలు

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం పట్టణ ముస్లిం సోదరులు మాట్లాడుతూ... గురువారం శుక్రవారం మరియు శనివారం రోజులలో హజరత్ సయ్యదిన్ సమాజ్ కేల్ షావలి రహమతుల్లా హల్లే తేదీ 18 జూన్ 2026. గురువారం రోజున హజరత్ సయ్యదిన సమాజ్ కేల్ షా వలి రహమతుల్లా అలై. గ్రంథోత్సవం సందల్ - ఎ - ముబారాక్ సాయంత్రం 6:00 గంటలకు బాద్ నమాజ్ - ఎ - మగేరీబ్ జరుపబడుతుంది. కరెంట్ ఆఫీస్. సబ్ స్టేషన్. మీనీ రైతు బజార్ పక్కన మహేశ్వరం గ్రామం తేదీ 19 జూన్ 2026 శుక్రవారం రోజున హజరత్ సయ్యదిన హైదర్ అలీషా ఖాదిరి రహమతుల్లా అలై గ్రంథోత్సవం సందల్- ఎ - ముబారక్. సాయంత్రం 6:00 గంటలకు బాద్ నమాజ్ - ఎ - మాగరీబ్ జరుపబడుతుంది. మజిద్ - ఎ - మన్నాన్ ఖాన్. మెయిన్ చౌరస్తా మహేశ్వరం గ్రామం. శనివారం రోజున సాయంత్రం 6:00 గంటలకు దీపారాధన చిరాగా ఫాతిహా. జరుపబడుతుంది. కనుక భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గ్రంథోత్సవం ఉర్సు- ఇ- షరీఫ్. లో పాల్గొనవలసిందిగా కోరడమైనది. హజరత్ సయ్యదిన హైదర్ అలీషా ఖాదిరి రహమతుల్లా అలై దర్గా. మస్జిద్ - ఎ - మన్నాన్ ఖాన్. మహేశ్వరం మెయిన్ చౌరస్తా. గ్రామం :- మహేశ్వరం
మండలం :- మహేశ్వరం
రంగారెడ్డి జిల్లా.





# యువత భవిష్యత్తుకు డ్రగ్స్ శాపం

### అనకాపల్లిలో ఘనంగా నిర్వహించిన భారీ 'మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీ'...

సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, యువతను వ్యసనాలకు దూరం చేయడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం మరియు జిల్లా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఒక అవగాహన ర్యాలీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు అనకాపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పీ ఎం. శ్రావణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. నేడు ఉదయం అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ, పట్టణ ప్రధాన వీధుల గుండా సాగుతూ ఫోర్ రోడ్ జంక్షన్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ. శ్రీనివాసులు, టౌన్ సీఐ ప్రేమ కుమార్, సీఐలు వెంకట నారాయణ, అశోక్ కుమార్, గోవింద రావు మరియు ఎస్సై శ్రీనివాస రావు లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం నుండి ఫోర్ రోడ్ జంక్షన్ వరకు సాగిన ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు, యువత, మరియు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్న దృశ్యాలు డ్రోన్ కెమెరాలలో అద్భుతంగా నిక్షిప్తమయ్యాయి.




ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులు, పోలీస్ అధికారులు చేతుల్లో విభిన్నమైన అవగాహన బ్యానర్లను ప్రదర్శించారు.
మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. "డ్రగ్స్ రహిత సమాజం - సంక్షేమానికి సంకేతం... డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్రాప్రదేశ్... డ్రగ్స్ వద్దు.. చదువే ముద్దు" మరియు అనే అనకాపల్లి జిల్లా పోలీసుల ప్రత్యేక నినాదాలతో కూడిన బ్యానర్లు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లాకు చెందిన 'యోగాపథం' ప్రతినిధులు కూడా ఈ ర్యాలీలో చురుగ్గా పాల్గొని, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. వ్యసనాల నుంచి విముక్తి పొందడానికి జిల్లా ఆసుపత్రిలోని విముక్తి కేంద్రాన్ని (టోల్ ఫ్రీ నెంబర్: 1972) సంప్రదించవచ్చని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## మొహబ్బత్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో "అమ్మ మాట – అంగన్‌వాడి బాట.


హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర్త్యా రాజు నాయక్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారికి విద్య పట్ల ఆసక్తిని పెంపొందించారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య మరియు చిన్నారుల సమగ్ర అభివృద్ధి గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శారద విద్యా అధికారులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## నేడు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి

### జిహెచ్ఎంసి తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోసిక ఐలయ్య

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 17:-
రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ ప్రాంతంలోని ఇంజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రతిష్ఠించిన విద్యాదేవి సరస్వతి విగ్రహాన్ని గురువారం, జూన్ 18న ప్రజల సమక్షంలో ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు, పార్టీ శ్రేణులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లను పరిశీలిస్తూ, కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



## అన్ని దానాల కన్నాఅన్నదానం ఎంతో గొప్పది

### కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి




శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి(భగవాన్) ఆధ్వర్యంలో గత 38 మాసాలుగా అమావాస్య రోజు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు కమిటీ చైర్మన్ దండేటి కార్ భగత్ జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని తెలిపారు చంపాపేట్ నల్లపోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాని నిర్వహించారు. సుమారు 500 మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు తెలిపారు సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్,సుశీల్ కుమార్,సంతోష్ లడ్డ, , గణసాల వెంకటేష్ ( చింటూ),ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్ పూర్ శివ. షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్,ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదేకుమార్,గుర్రం పావని, ఎస్ సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి సుభాష్, డి సతీష్, డి సందీప్, డి సూర్యన్స్, ఆకుల దీప, రేండ్ల సారయ్య, , మనోజ్, భవాని, సాత్తిరిమహేష్ , ఉపేందర్ చారి, కేకే సూర్య తేజ, ఎం దీపక్, మాడ కుట్నెస్, గాజుల నవీన్ కుమార్ , నల్ల దేవేందర్ , సాయి సాగర్ , విజయ్ కుమార్, కే రాము, ఎస్ సాయికుమార్, ప్రశాంత్ యాదవ్, గూడ శ్రీనివాస్, అభిలాష్, జి సాయికుమార్, గోగిఖర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు

## స్పీకర్ అయ్యాను మర్యాదపూర్వకంగా కలిసిన దాడి వీరభద్రరావు



రాజ్యసభ సభ్యునిగా చింతకాయల విజయ్ ను నియమించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ని వారి నివాసంలో మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్ర రావు మరియు తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ కలిసి అభినందించారు. ఉత్తరాంధ్రలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తరువాత సుమారు 30 సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభకు విజయ్ ని నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మరియు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు . రాజకీయ కుటుంబానికి చెంది చిన్ననాటి నుండి పార్టీలో పనిచేసిన విజయ్ కి రాజ్యసభ సభ్యునిగా పంపడంపట్ల దాడి వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 గురువారం జూన్ 2026

# గెస్ట్ లెక్చరర్ల ను విధుల్లోకి తీసుకోవాలి..

## – టీపీటీఫ్ డిమాండ్!



హనుమకొండ జిల్లాలో గల బీ.ఎడ్, డీ.ఎడ్ కళాశాల లో గెస్ట్ లెక్చరర్లు గా పని చేస్తున్న, దాదాపు 25 మంది ఉపాధ్యాయులను తొలగించడాన్ని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరమ్ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ సందర్భంగా టీపీటీఫ్ ఉమ్మడి వరంగల్ అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్ మాట్లాడుతూ, ఎంతో కాలంగా పని చేస్తున్న ఉపాధ్యాయులను ఎలాంటి జీవో ను ఇవ్వకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా, రాష్ట్ర ప్రభుత్వం పేరు చెప్పి తొలగించడం అమానుషం అని అన్నారు, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నోసార్లు గెస్ట్ లెక్చరర్ లను పర్మినెంట్ చేస్తాం, వేతనాలు పెంచుతాం అని చెప్తూ కాలం వెళ్ళదీసిన ప్రభుత్వం, ఈ రోజున మొత్తానికే వాళ్లను ఉద్యోగాల నుండి తీసివేయడం బాధాకరం అని, భాదితులకు న్యాయం చేయాల్సింది గా ఉపాధ్యాయ బృందం తో హనుమకొండ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, టీపీటీఫ్ నాయకులు పాల్గొన్నారు.

# కాజీపేట చౌరస్తాలో చర్చకు సిద్ధం


## – కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి సవాల్,




హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేటలో బిజెపి ఆధ్వర్యంలో "చాయ్ పే చర్చ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలనలో తెలంగాణలో మరియు ముఖ్యంగా కాజీపేట ప్రాంతంలో జరిగిన అపూర్వ అభివృద్ధి, సంక్షేమంపై ఈ సందర్భంగా ప్రజలతో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమం అనంతరం బిజెపి రాష్ట్ర నాయకులు రావు పద్మ రెడ్డి మాట్లాడారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకులు నాయిని రాజేందర్ రెడ్డి బిజెపి పార్టీపై, కేంద్ర ప్రభుత్వంపై చేసిన అసత్య వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ:

"బిజెపిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విసిరిన సవాల్‌ను మేము పూర్తిగా స్వీకరిస్తున్నాం. కాజీపేట చౌరస్తాలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు మేము సిద్ధం. దానికి సంబంధించిన సమయం, తేదీని రాజేందర్ రెడ్డి గారే ఖరారు చేసి చెప్పాలి. కేంద్రం ఏం చేసిందో మేము నిరూపిస్తాం, మీరు కాజీపేటకు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా?" అని సవాల్ విసిరారు. గత 12 సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం కాజీపేట ప్రాంతానికి అందించిన నిధులు, అభివృద్ధిని ఆమె వివరించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం రూ. 25 కోట్లు. కాజీపేటలో అత్యాధునిక నూతన రైల్వే హాస్పిటల్ నిర్మాణం. స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా రూ. 720 కోట్ల భారీ బడ్జెట్‌తో రైల్వే కోచ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు వేగంగా జరుగుతున్నాయి అని, వీటితో పాటు దేశవ్యాప్తంగా, తెలంగాణలో సామాన్య ప్రజల సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజలకు వివరించారు. గతంతో పోలిస్తే భారతదేశం నేడు ప్రతి రంగంలో ముందడుగు వేస్తూ, ప్రపంచ వేదికపై తన ప్రత్యేక గుర్తింపును మరింత బలంగా నిలబెట్టుకుంటోందని, పారదర్శకతతో కూడిన పాలన కేవలం మోడీ ప్రభుత్వంతోనే సాధ్యమైందని రావు పద్మ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ పటేల్, తోపుచెర్ల అర్చన మధుసూదన్ రావు, భగవాన్ ఉపాధ్యాయ, కాయిత రాజ్ కుమార్, కొల్లూరి ఆదిత్య సాయి, డివిజన్ అధ్యక్షులు మేకల శ్రావణ్ కుమార్, రేణుకుంట్ల కల్యాణ్, గందసిరి శ్రీకాంత్, స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ట్రైనింగ్ క్యాంప్



మమ్నూర్ పీటీసీ ప్రాంగణంలో 8(టి) గర్ల్స్ బెటాలియ న్ ఎన్సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (CATCII) నాల్గవ రోజు వివిధ శిక్షణా, అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ డి.వి. సంతోష్ మెహర్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సున్వారే, క్యాంప్ సీనియర్ జేసీవో సుబేదార్ సంజయ్ కుమార్ రాణా ఆధ్వర్యంలో జీసీఐలు, ఏఎన్వోలు, పీఐ సిబ్బంది మరియు సీటీఓలు క్యాడెట్ల కోసం నినాద రచన (Slogan Writing), (Poster Making), గిగి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ గ్రూప్ హెడ్క్వార్టర్స్ ట్రైనింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఎం. రియాజ్ క్యాంప్ను సందర్శించి క్యాడెట్లతో ముచ్చటించి వారికి విలువైన సూచనలు అందించారు. అదేవిధంగా మట్వాడ ఫైర్ పోలీస్ స్టేషన్ అధికారులచే అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్ని భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రఖ్యాత స్త్రీ రోగ నిపుణురాలు డాక్టర్ చైతన్య "మహిళల రుతు క్రమ పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ" అంశంపై ప్రత్యేక ఉపన్యాసం అందించి, యువతుల ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను వివరించా రు. ఈ కార్యక్రమాలలో క్యాంప్ అధికారులు, సిబ్బంది మరియు 600 మంది క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు అంకితం

## ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యం:సీఎం రేవంత్ రెడ్డి






హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 17

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో సమావేశమైన సీఎం, అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ విభాగాలు, లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్‌లు, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ప్రయోగశాలలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్క నాటి, డాన్స్, మ్యూజిక్ రూమ్‌లను సందర్శించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో విద్యార్థులతో కలిసి కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆరుట్లలో ప్రారంభమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక గ్రామానికి మాత్రమే పరిమితం కాదని, రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంకితమని పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని విశ్వసిస్తూ ప్రభుత్వం విద్యా రంగంలో విస్తృత సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్యా కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. ఒక ప్రభుత్వ పాఠశాలకు 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం సంతోషకర విషయమని, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎన్నో మాణిక్యాలు వెలుగులోకి వచ్చాయని, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివారని గుర్తు చేశారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులుగా ఎదగాలని, తమ కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఆరుట్ల గ్రామం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన యూనిఫారాలు, కిట్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 9న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్న సీఎం, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజల సహకారంతో తెలంగాణను విద్యారంగంలో దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ

## – యూరియా విక్రయాలు ఇకపై ఫర్టిలైజర్ యాప్ ద్వారానే,







శాయంపేట మండల వ్యవసాయ అధికారి ఎం. ప్రియదర్శిని ఆధ్వర్యంలో, ఏఈఓ అన్వేష్ సమన్వయంతో సాధారణ తనిఖీలలో భాగంగా కొప్పుల గ్రామంలోని నూజాజా ఫర్టిలైజర్స్, రైతు మిత్ర ఫర్టిలైజర్స్ మరియు శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పూజా స్టాక్, భౌతిక నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు మరియు బిల్ పుస్తకాలను పరిశీలించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అన్ని ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఫర్టిలైజర్ యాప్ ద్వారానే నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా చూడాలని డీలర్లకు ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో యూరియా విక్రయాలన్నీ పూర్తిగా యాప్ ద్వారా నిర్వహించబడనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియా ఇతర అవసరాలకు మళ్లిపోకుండా, నిజమైన రైతులకు మాత్రమే అందేలా చేయడం, అలాగే రైతులు ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన అవసరం లేకుండా చేయడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు ఇంటి నుంచే యాప్‌లో యూరియా బుక్ చేసుకుని, 48 గంటల లోపు తమకు అనుకూలమైన సమయంలో బుకింగ్ ఐడీ, ఆధార్ కార్డు మరియు పట్టాదార్ పాస్‌బుక్ చూపించి ఎరువులను పొందవచ్చని వివరించారు.

ఫర్టిలైజర్ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉందని, యాప్‌ను తెలుగు మరియు ఆంగ్ల భాషల్లో ఉపయోగించవచ్చని తెలిపారు. యాప్ స్క్రీన్ కుడివైపు పైభాగంలో (Right Top Corner) ఉన్న భాష ఎంపిక (Language Option) ద్వారా రైతులు తమకు అనుకూలమైన భాషను ఎంచుకోవచ్చన్నారు. రైతులు తమ భూ విస్తీర్ణానికి అనుగుణంగా 2 లేదా 3 విడతలుగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కౌలు రైతులు యాప్‌లోని జఙఅఓవఅ (పౌరుడు) ఆప్షన్ ద్వారా ముందుగా నమోదు చేసుకోవాలని, అనంతరం =వస్త్రఅర్వతీవఎ ఎవఅఖత్ (నమోదిత కౌలుదారు) ఆప్షన్‌లోకి వెళ్లి యూరియా బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో చురుకైన యువకులు, రైతులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఎం. ప్రియదర్శిని ఏఈఓ జ్యోష్ణ ఆధ్వర్యంలో సర్పంచులు, యువత మరియు రైతులకు ఫర్టిలైజర్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పెద్దకోడేపాక క్లస్టర్‌లో ఏఈఓ అన్వేష్, ప్రగతి సింగారం క్లస్టర్‌లో ఏఈఓ సానియా తమ తమ క్లస్టర్లలో సర్పంచులు, యువత మరియు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫర్టిలైజర్ యాప్‌లో లాగిన్ సమస్యలు ఎదురైన రైతులు లేదా మొబైల్ నంబర్ అప్‌డేట్ అవసరమైన రైతులు తమ క్లస్టర్‌కు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులను (ూజూం) సంప్రదించాలని సూచించారు. యూరియా బుకింగ్, బుకింగ్‌కు సంబంధించిన సమస్యలు, సాంకేతిక సహాయం, మార్గదర్శకాలు మరియు ఇతర వివరాల కోసం తక్షణ సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800-123-7157ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సేవలు పని దినాల్లో మాత్రమే (Working Days Only) ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# శ్రీ నాగదుర్గమ్మను దర్శించుకున్న ... జనసేన నేత ఆళ్ల ఇందు రామచంద్రరావు



పట్టణంలోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ప్రాంగణంలో వెలసిన శ్రీశ్రీ శ్రీ నాగదుర్గమ్మ అమ్మవారి 24 వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, కార్మికులకు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ పరిధిలోని కొలగార్ల సంఘం, కళాసీల సంఘం, మరియు గుమస్తాల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా సాగింది.

జనసేన నాయకుడికి సాదర స్వాగతం....

ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు జీవీఎంసీ 82వ వార్డు జనసేన పార్టీ కన్వీనర్ ఆళ్ల ఇందు రామచంద్రరావు విచ్చేశారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఆలయ చైర్మన్ బుద్ధ నాగేశ్వరరావు, సెక్రటరీ పొలిమేర బాబ్జీ మరియు కమిటీ ప్రతినిధులు, సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆయనకు గౌరవ సూచకంగా కండువా కప్పి ఘనంగా సత్కరించారు.

అమ్మవారి ప్రత్యేక పూజలు....

అనంతరం ఆళ్ల ఇందు రామచంద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. వ్యాపారాలు సజావుగా సాగాలని, మార్కెట్ కార్మికులు, వ్యాపారులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మళ్ల శ్రీను మరియు కొలగార్ల, కళాసీ, గుమస్తాల సంఘాల ముఖ్య నాయకులు, మార్కెట్ వ్యాపారులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక సాంకేతికత



హైదరాబాద్ క్యాన్సర్ రోగుల చికిత్సలో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ యశోద హాస్పిటల్స్ సరికొత్త విప్లవాత్మక సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. వృద్ధులు, తీవ్రమైన ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న క్లిష్టమైన క్యాన్సర్ రోగుల కోసం భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా 'ఎంఆర్-లినాక్' యంత్రం ద్వారా 'హైపోఫ్రాక్షనేటెడ్ అడాప్టివ్ రేడియేషన్ థెరపీ' (హైపో-ఆర్ట్) విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. గతంలో వయసు పైబడిన వారిలో లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారిలో ముదిరిన క్యాన్సర్ కణితులకు చికిత్స చేయడం వైద్యులకు పెద్ద సవాలుగా ఉండేది. సాంప్రదాయ రేడియేషన్ పద్ధతుల్లో ఎక్కువ రోజులు చికిత్స అందించాల్సి రావడం, దానివల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదురుకావడం వంటి ఇబ్బందులు ఉండేవి. అయితే, ప్రస్తుత 'హైపో-ఆర్ట్' విధానం ఇలాంటి క్లిష్టమైన రోగులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సరికొత్త చికిత్సా విధానం గురించి యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ కారుమంచి మాట్లాడుతూ.. "వయస్సు పైబడటం లేదా ఇతర సంక్లిష్ట వైద్య చరిత్రలు ఉన్నప్పటికీ ఇప్పుడు క్యాన్సర్ కు అత్యంత సమర్థవంతంగా చికిత్స చేయవచ్చు. ఈ హైపో-ఆర్ట్ విధానం ద్వారా ప్రతి సెషన్ లోనూ క్యాన్సర్ కణితిపై అత్యంత ఖచ్చితత్వంతో కూడిన శక్తివంతమైన రేడియేషన్ మోతాదును అందించవచ్చు. దీనివల్ల చికిత్స తీసుకోవాల్సిన రోజుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికత వల్ల రోగులు పదేపదే ఆసుపత్రి చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా వృద్ధ రోగులకు శారీరక శ్రమ, చికిత్స తాలూకు అలసట చాలా వరకు తగ్గుతాయి. ఈ చికిత్సను మరింత సురక్షితంగా, ఖచ్చితత్వంతో అందించడానికి డాక్టర్ కారుమంచి నేతృత్వంలోని వైద్య బృందం హై-ఫీల్డ్ ఎంఆర స్కానర్ కలిగిన అత్యాధునిక ఎంఆర్-లినాక్ యంత్రాన్ని ఉపయోగిస్తోంది. ఈ విధానం క్యాన్సర్ బాధితుల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

# హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో చైర్మన్ వైస్ చైర్మన్ లకు సన్మానం



యునైటెడ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎర్ర ప్రియాంక బండి జనార్దన్ లను మరియు కార్యవర్గమునకు మహమాలి యూనియన్ కార్మికల సన్మానం చేసి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలతో సత్కరించారు. మా యొక్క కార్మికుల సమస్యల విషయములను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చుంచు కనకయ్య ప్రధాన కార్యదర్శి గంధం సుధాకర్ యూనియన్ క్యాషియర్ ఓని .శ్రీనివాసులు మరియు కార్మిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద వ్యక్తులపై పోలీసు నిఘా

## - వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్,



ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. తమ పరిసరాల్లో ఎవరైనా గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్లో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుమానితుల తనిఖీలను పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి, స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ సన్రైత్ సింగ్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్లు వంటి ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందన్నారు. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ లను దేశంలోని వివిధ రాష్ట్రాలను కలిపే ప్రధాన జంక్షన్లుగా ఉండటంతో నేరస్థులు సులభంగా రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారని, నేరాలకు పాల్పడిన అనంతరం తిరిగి తమ స్వస్థలాలకు పారిపోతున్నారని తెలిపారు.

ఈ తరహా అంతర్రాష్ట్ర నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీపీ ప్రకటించారు. వీటిలో రెండు బృందాలు వరంగల్ రైల్వే స్టేషన్లో, మరో రెండు బృందాలు కాజీపేట రైల్వే స్టేషన్లో విధుల్లో ఉంటాయి. ఈ బృందాలు ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో షిఫ్ట్ వారీగా నిరంతరం నిఘా ఉంచుతాయి. ఉత్తర భారతదేశం సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో ప్రయాణించే అనుమానిత వ్యక్తులను ఈ ప్రత్యేక బృందాలు గుర్తించి, వారి సామాగ్రిని తనిఖీ చేస్తాయని సీపీ వివరించారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్పీ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ అభినవ్తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశంస పత్రం అందుకున్న సర్పంచ్ అశోక్



శాయంపేట మాజీ జడ్పిటిసి వంగాల నారాయణరెడ్డి మార్చి 23 జన్మదినం పురస్కరించుకొని సామాజిక సేవకుడు వైనాల రాజేందర్ ఆధ్వర్యంలో 70 మంది రక్తదానం చేశారు.మంగళవారం హన్మకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా కొప్పుల గ్రామ సర్పంచ్ మామిడి అశోక్ ప్రశంస పత్రం అందుకున్నారు

# వైనాల రాజేందర్ కు డాక్టరేట్ మరియు రాష్ట్ర పురస్కార్ నేషన్ అవార్డు

## – స్వర్ణ నంది అవార్డు గ్రహీత వైనాల రాజేందర్(రాజు)కు మరో అరుదైన గుర్తింపు!




సమాజ సేవను జీవిత ధ్యేయంగా మార్చుకుని, పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వర్ణ నంది అవార్డు గ్రహీత వైనాల రాజేందర్ (రాజు)కి మరో అరుదైన గౌరవం దక్కింది. ఆయన చేస్తున్న విశిష్ట సామాజిక సేవలను గుర్తించిన ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ సంస్థ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను ఈనెల 15 సోమవారం రోజున హైదరాబాదులోని (అబిడ్స్) బొగ్గులకుంట లోని సరస్వతి పరిషత్ లో ప్రధానం చేశారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన వైనాల రాజేందర్ (రాజు )శంకరయ్య, సత్తమ్మ దంపతుల పెద్ద కుమారుడు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగిన ఆయన సమాజంలోని నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులు మరియు ఆపన్నులకు అండగా నిలుస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధన కోసం విశేష కృషి చేశారు. కరోనా కష్టకాలంలో కూడా గ్రామ ప్రజలకు అండగా నిలిచారు. ఈ మధ్యనే స్వర్ణ నంది అవార్డును కూడా అందుకోవడం జరిగింది.

తాను చేస్తున్న సామాజిక విశిష్ట సేవలను దృష్టిలో ఉంచుకొని ప్రముఖుల సమక్షంలో రాజేందర్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు .ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ గూడూరు చిన్నారెడ్డి (గూడూరు ఫౌండేషన్ వ్యవస్థాపకులు), లయన్ డాక్టర్ షేక్ రుక్సానా బేగం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు), డాక్టర్ భీమగాని యాదగిరి గౌడ్ (తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం), డాక్టర్ కాశీనాథ్ (మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి సెక్రటరీ), డాక్టర్ సరిత మాలో (మానవ హక్కుల సంఘం మహిళ జాతీయ అధ్యక్షురాలు) చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు .రాజేందర్ తన సేవా కార్యక్రమాల ద్వారా ఎన్నో కుటుంబాల్లో వెలుగులునింపారు.వికలాంగులకు బ్యాటరీ వాహనాలు, వీల్ చైర్లు, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు, కళ్ళజోడు అందించడం, పేదలకు కంటి ఆపరేషన్లు చేయించడం, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సహాయంతో జీవితాల్లో కొత్త వెలుగులు చూసిన వారు ఎందరో ఉన్నారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఈ మధ్యనే వచ్చిన స్వర్ణ నంది అవార్డు అలాగే తనను గౌరవ డాక్టరేట్ కు ఎంపిక చేసినందుకు సమాజ సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలుస్తానని చెప్పారు.సాధారణ కుటుంబం నుంచి ఎదిగి సమాజ సేవలో విశేష గుర్తింపు పొందిన వైనాల రాజేందర్ ఎంతో మంది యువతీ యువకులకు ఆదర్శంగా నిలిచారని శాయంపేట మండల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బొద్దున వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బొద్దున వెంకటేశ్వర్లును 'వరంగల్ వాయిస్' దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్లు దేశవ్యాప్త గ్రామీణ తపాలా ఉద్యోగుల నమ్మకాన్ని చూరగొని మరోమారు జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని వరంగల్ వాయిస్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి మాట్లాడుతూ.. బొద్దున వెంకటేశ్వర్లు జాతీయ స్థాయి పదవికి వరుసగా రెండోసారి ఎన్నిక కావడం మన ప్రాంతానికి గర్వకారణమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో జర్నలిస్ట్ ఎస్. రాకేష్ తో పాటు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ అధ్యక్షులు పెరుమాండ్ల తిరుపతి, సహాయ కార్యదర్శి బూర వెంకటేష్, ప్రముఖ సంఘ నాయకులు సిహెచ్ సాంబయ్య, ఎండి యూసుఫ్దీన్, పి. హనుమాచారి తదితరులు పాల్గొని నూతన జాతీయ అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

# దీధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు



వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో అనగా దివి: 17-06-2026 బుధవారం పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి చేతుల మీదుగా తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆలయ ధర్మకర్తలు, భక్తులు, దాతలు అందరి సమక్షంలో ఉదయం గం। 08-36 నివలకు ఎంతో వైభవంగా ప్రతిష్ఠించబడబోయే ఆలయ ధ్వజస్తంభానికి ధాన్యాదివాసం, ఫల, పుష్ప, శయ్యాది వాసాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

ఉదయం నుండి సాయంకాలం వరకు ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు అధ్వర్యవమున అనేక మంది వేదపండితులు, ఋత్విక్కులతో వరంగల్ మహానగర సుప్రసిద్ధి ఆగమ శాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ గణేశ ఆత్రేయ శర్మ క్రతువు నిర్వహించే విధానం భక్తులకు ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించింది. మూడు గంటల పాటు పలు విధములైన హెమాలు, అభిషేకాలు భక్తులను పరవశింపజేసింది. తీవ్రమైన ఎండను కూడా లెక్కజేయకుండా ఈ క్రతువులో భక్తులు మునిగిపోవడం చూపరులను ఆశ్చర్యచకితులను చేసింది. ఉదయం 10 గంటలకు మొదలైన కార్యక్రమం 2 గంటల వరకు జరుపబడి పూర్తికాగానే జరువబడిన నవనవిధి పూర్తయ్యేంతవరకు భక్తులకు సమయం తెలియలేదు. అనంతరం ప్రసాదం స్వీకరించి వెళ్ళారు. మళ్ళీ ఈ క్రతువును దర్శించడానికి సాయంకాలం గం॥ 04-00ల వరకే దేవస్థానం వద్ద భక్తులు గుమికూడారు. సాయంకాలం గంవ 07-00లకు ధాన్యాదివాసం, ఫల, పుష్ప, శయ్యాది వాసములు అన్ని జరుపబడి నీరాజన మంత్రపుష్పములు, మహాప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తయింది. బుధవారం ఉదయం గం॥ 06-00లకు మళ్ళీ ఈ ధ్వజస్తంభక్రతువు ప్రారంభమౌతుంది. గంవ08-36 ని॥లకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ. భక్తులు ఈ ధ్వజస్తంభం ప్రతిష్ఠా నిమిత్తం ఆరోహణ జరుగుతుండటం దర్శించడం వల్ల ఒక మహా పుణ్యాన్ని ప్రజలు పొందుతారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు భారతి వెంకటేశ్వర్లు, గోపాల విజయ్కుమార్, పుప్పాల శివశంకర్, మూల రాంమూర్తి, బొమ్మగాని కృష్ణమూర్తి, పురం సతీష్కుమార్లతో పాటు దేవాలయ చైర్మన్ డావ బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు శ్రీయుతులు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్,మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, తొగరు క్రాంతికుమార్, అనంతుల శ్రీనివాస్ తదితరులతో పాటు అనేక మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మట్టేవాడ పోలీసులు



పెద్దనాన్న ఆటో వెనకాల వెళ్తూ తప్పిపోయిన బాలికను పోలీసులు గుర్తించి, ఆమెను మట్టేవాడ పోలీస్ స్టేషన్ వద్దకు చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. వరంగల్ చౌరస్తాలోని సత్యం హాస్పిటల్ సమీపంలో గల షబీనా (6) అనే బాలిక మంగళవారం ఆటో డ్రైవర్ అయినా తన పెద్దనానతో ఆటోలో వస్తానని మారం చేయగా ఆయన వద్దంటూ ఆటోలో బయటికి వెళ్లాడు. దీంతో షబీనా తన పెద్దనాన్న ను వెతుక్కుంటూ పోచమ్మ మైదాన్, ఎంజీఎం మీదిగా ములుగు రోడ్డుకు వెళ్ళసాగింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న మట్టేవాడ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నరేష్ కుమార్ తోపాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కుమారస్వామి, బాలరాజు బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సదరు బాలికను మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఎస్. ఐ రాజేందర్ కు అప్పగించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 గురువారం జూన్ 2026

## మెగాస్టార్ చిరంజీవి వ్యక్తిత్వంపై జగపతిబాబు ప్రశంసలు



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవి గురించి పంచుకున్న కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. జగపతిబాబు హీరోగా పరిచయమైన తొలి సినిమా 'సింహ స్వప్నం'. ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టాల్సిందిగా కోరడానికి జగపతిబాబు, ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారట. అప్పట్లో చిరంజీవి గారు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా, స్టార్‌డమ్‌లో పీక్స్‌లో ఉన్నప్పటికీ.. వీరిని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారట. అంతేకాదు, జగపతిబాబును చూడగానే "చాలా అందంగా ఉన్నావు" అని మెచ్చుకుని, అడగడమే ఆలస్యం వెంటనే వచ్చి సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఇక ఆ సంఘటన జరిగిన దాదాపు 35 సంవత్సరాల తర్వాత, 'పెద్ది' సినిమాలో జగపతిబాబు పోషించిన పాత్రను చూసి చిరంజీవి మళ్లీ అదే స్థాయిలో ఫోన్ చేసి మరీ ప్రశంసించారట. చిరంజీవిలోని ఆ గొప్ప గుణాన్ని జగపతిబాబు ఈ ఇంటర్వ్యూలో ఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఒకప్పుడు హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన జగపతిబాబు, ప్రస్తుతం వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతున్నారు.

# విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లకు లీగల్ నోటీసులు..

# 'టీజీ20 లీగ్' వివాదంలో సినీ, క్రీడా ప్రముఖులు!

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' చుట్టూ ఇప్పుడు ఊహించని లీగల్ ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరోలు వెంకటేష్, విజయ్ దేవరకొండలతో పాటు పలువురు స్టార్ క్రికెటర్లకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) లీగల్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు స్పోర్ట్స్ అండ్ సినీ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది.

బీసీసీఐ అనుమతి లేదు - టీసీఏ సంచలన ఆరోపణలు:

భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హెచ్‌సీఏ ఈ టీజీ20 లీగ్‌ను అక్రమంగా నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ స్పష్టం చేసింది. బోర్డు పర్మిషన్ లేని లీగ్‌ను సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం చట్టప్రకారం తప్పని



వేలెత్తి చూపింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ లీగ్ పేరు వాడుకుంటూ కార్పొరేట్ కంపెనీలతో హెచ్‌సీఏ రూ. వందల కోట్ల బిజినెస్ చేస్తోందని టీసీఏ మండిపడింది. ఇది కేవలం యువ క్రికెటర్లను, స్పాన్సర్లను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించింది. ఈ అక్రమ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారంటూ టీసీఏ కింది ప్రముఖులకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపింది:

సినీ ప్రముఖులు: రౌడీ హీరో విజయ్ దేవరకొండ, విక్టరీ వెంకటేష్.

క్రికెట్ స్టార్స్: టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్, యువ సెన్సేషన్ తిలక్ వర్మ, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు.

బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేస్తూ సాగుతున్న ఈ లీగ్ ప్రమోషన్లపై సదరు ప్రముఖులు వెంటనే పునరాలోచన చేయాలని.. లేనిపక్షంలో చట్టపరంగా కఠినమైన న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ గట్టిగా హెచ్చరించింది.

# ఆ పాటలో ఇంకాస్త బాగా చేసి ఉండాల్సింది: తమన్నా



రజనీకాంత్ నటించిన 'జైలర్' చిత్రంలోని 'నువ్వు కావాలయ్యా' పాట ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలిసిందే. ఈ పాటలో తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన నటి తమన్నా, ఆ పాటలో తన పెర్ఫార్మెన్స్ పట్ల తాను సంతృప్తిగా లేనని తాజాగా వెల్లడించారు. ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకురాలు ఫరా ఖాన్ తన యూట్యూబ్ వ్లాగ్ కోసం ముంబైలోని తమన్నా ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇద్దరూ తమన్నా కెరీర్‌లోని పలు పాటల గురించి మాట్లాడుకున్నారు. ఈ క్రమంలోనే 'కావాలయ్యా' పాట ప్రస్తావన వచ్చింది. అప్పుడు తమన్నా మాట్లాడుతూ, "ఆ పాట షూటింగ్ సమయంలో నా నటనపై నేను కొంచెం అసంతృప్తిగా ఉన్నాను. ఇంకా మెరుగ్గా చేసి ఉండాల్సింది అనిపించింది" అని తెలిపారు. దీనికి ఫరా ఖాన్ స్పందిస్తూ, "నువ్వు ఎప్పుడూ ఇంకా బాగా చేయొచ్చు అని భావించే రకం" అని అన్నారు. తాను శిక్షణ పొందిన డ్యాన్సర్‌ని కాదని, 'ఆజ్ కీ రాత్' అనే పాట కోసం 15 రోజులు రిహార్సల్స్ చేశానని, అలాంటి సమయం కేటాయించాలని కోరుకుంటానని తమన్నా వివరించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన 'కావాలయ్యా' పాటకు శ్రీసాయి కిరణ్ సాహిత్యం అందించారు. సింధుజా శ్రీనివాసన్, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఇక సినిమాల విషయానికొస్తే, తమన్నా ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వ్వాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే చిత్రంలో నటిస్తున్నారు. అలాగే, ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'రాగిణి 3' అనే హారర్ చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ట్రెడ్‌మిల్‌ను రివర్స్‌లో వాడేస్తున్న బుట్టబొమ్మ!

నటి పూజా హెగ్డే తన ఫిట్‌నెస్‌కు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కెమెరా ముందు పర్ఫెక్ట్ ఫిజిక్‌తో కనిపించడానికి ఆమె కఠినమైన నియమాలు పాటిస్తుంటుంది. జిమ్‌లో చెమటలు చిందించడం నుంచి ఆహార నియమాల వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో, తరచూ తన వర్కౌట్ వీడియోలతో అభిమానులను, ఫిట్‌నెస్ ప్రియులను ఉత్తేజపరుస్తుంటుంది. తాజాగా మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో మరో వర్కౌట్ వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో పూజా హెగ్డే ట్రెడ్‌మిల్‌పై స్టైల్‌గా వెనక్కి నడుస్తూ కనిపించింది. తన ఫోన్‌తో తానే వీడియో తీసుకుంటూ ఈ విన్యాసం చేసింది. ఆరెంజ్ కలర్ క్రాప్ టాప్, దానికి సరిపోయే షార్ట్స్ ధరించి వర్కౌట్ సెషన్‌లో పాల్గొంది. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన పోస్టులు చేయడం పూజాకు కొత్తేమీ కాదు. తరచుగా తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన విషయాలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటుంది. ఇక సినిమాల విషయానికొస్తే, పూజా హెగ్డే ఇటీవల "హై జవానీ తో ఇష్క్ హోనా హై" అనే రొమాంటిక్ కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్‌లతో కలిసి ఆమె నటించింది. జూన్ 5న



విడుదలైన ఈ సినిమాలో మౌనీ రాయ్, చుంకీ పాండే, మనీష్ పాల్, జిమ్మీ షెర్గిల్ వంటి ప్రముఖ నటులు కూడా ఉన్నారు. టిప్స్ బ్యానర్‌పై రమేష్ తౌరానీ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# పొట్టి నిక్కర్లో బాలయ్య బ్యూటీ సెగలు!

అఖండ సినిమాలో కలెక్టర్ పాత్రతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ప్రగ్యా జైస్వాల్ వరుసగా సినిమాలు చేస్తోంది కానీ స్టార్ హీరోయిన్ రేంజ్ లో ఈమధ్య అవకాశాలు అందుకోలేదని చెప్పాలి. ముఖ్యంగా టాలీవుడ్ మొదలు బాలీవుడ్ వరకు ఎన్నో సినిమాలలో చేసినప్పటికీ.. సరైన క్రేజ్ లేకపోవడం గమనార్హం. ఎలాగైనా సరే మంచి హిట్ అందుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న ఈమె మరొకవైపు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకొక ట్రెండీ అవుట్ ఫిట్ తో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తోంది. పొట్టి నిక్కర్ లో చెమటలు పట్టించిన ప్రగ్యా జైస్వాల్.. ముఖ్యంగా ఇంస్టాగ్రామ్ లో గ్లామర్ కి కొదవ లేకుండా రోజుకొక అవుట్ ఫిట్ తో అటు ప్రేక్షకులను ఇటు నెటిజన్ లను అలరించే ఈమె.. తాజాగా పొట్టి నిక్కర్లో బికినీను తలపించేలా డ్రెస్ ధరించి అందాలు ఆరబోసింది. క్రీమ్ కలర్ లేస్ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ మినీ క్రాప్ టాప్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో బాటమ్ వైట్ డెనిమ్ షార్ట్ ధరించి ఫోజులిచ్చింది. తన లుక్కును ఫుల్ ఫిల్ చేసుకోవడానికి వైట్ షర్ట్ ను ధరించిన ఈమె.. చేతుల వరకు మాత్రమే ధరించి మరో ఫ్యాషన్ ట్రెండ్ కి పునాది వేసింది. అలా మొత్తానికైతే ఈమె ధరించిన ఈ ట్రెండీ ఔట్ ఫిట్ యువతను విపరీతంగా అలరిస్తోంది. లా స్కూల్ నుండీ నటనారంగం వైపు.. ప్రగ్యా జైస్వాల్ మధ్యప్రదేశ్లోని జబల్పూర్లో జన్మించింది. ఇక పూణేలోని సింహయాసిస్ లా స్కూల్లో విద్యను అభ్యసించిన ఈమె సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లోనే వివిధ రకాల అందాల పోటీల్లో పాల్గొని సక్సెస్ఫుల్ మోడల్ గా ఎదిగింది .2008 ఫెమినా మిస్ ఇండియా పోటీలలో మిస్ ఎర్త్, మిస్ డాన్సింగ్ క్వీన్ వంటి టైటిల్స్ అందుకున్న ఈమె ఇటు పలు బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా వ్యవహరించింది. మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, ఎఫ్ బీ బీ , రిలయన్స్ డిజిటల్, డాబర్ వాటిక, డవ్ వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి పనిచేసింది. ఎన్నో అభిరుచు లు కూడా.. సినిమా మీద ఇష్టంతో మిర్చి లాంటి కుర్రాడు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె ఆ తర్వాత పనిచేసిన కంచె సినిమాతో నటిగా తనను తాను ప్రూవ్ చేసుకుంది.. ఇక బాలకృష్ణ నటించిన అఖండ, డాకూ మహారాజ్ సినిమాలలో నటించి మరింత క్రేజ్ సొంతం చేసుకుంది ప్రగ్యా జైస్వాల్. ఇక ఈమెకు నృత్యం అంటే చాలా ఇష్టం. అంతేకాదు మంచి గాయని కూడా.. ప్రముఖ స్టార్ హీరోలు చిరంజీవి, అల్లు అర్జున్ , నాగార్జున అంటే ప్రత్యేక అభిమానం.. అలాగే ఇష్టమైన హీరోయిన్స్ విషయానికి వస్తే అనుష్క, మాధురి దీక్షిత్ లను ఈమె ఎక్కువగా ఆరాధిస్తూ ఉంటుంది. పైగా నలుపు, తెలుపు, ఎరుపు అంటే చాలా ఇష్టపడే ఈమె.. లండన్ తన ఫేవరెట్ డెస్టినేషన్ గా చెబుతూ ఉంటుంది.









